క్లుప్తంగా

నేడు సర్వసభ్య సమావేశం

బంట్వారం: కోట్‌పల్లి మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, ఆయా శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

ఘనంగా హజ్రత్ అలీ ఉర్సు ఉత్సవాలు



దర్గాలో భక్తుల పూజలు

దౌల్తాబాద్: మండల కేంద్రంలో పెద్దచెరువుకట్టపై హజ్రత్ అలీ ఉర్సు ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. బుధవారం రాత్రి దర్గా వరకు చందల్ ఊరేగించారు. అనంతరం మతగురువులు ప్రార్థనలు చేశారు. గురువారం దర్గాను వేలాదిమంది భక్తులు దర్శించుకున్నారు.

పనులు పూర్తి చేయండి



ఆదర్శ పాఠశాలను సందర్శించిన ఎంఈఓ హరిశ్చందర్

దోమ: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో కొనసాగుతున్న మౌలిక వసతుల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మండల విద్యాధికారి హరిశ్చందర్ సూచించారు. గురువారం మండల పరిధి బాసపల్లి, దోర్నాల్‌పల్లి, గొడుగోనిపల్లి, పాలేపల్లి, ఖమ్మంనాచారం పాఠశాలలను ఆయన సందర్శించారు. జరుగుతున్న పనులను పరిశీలించి మాట్లాడారు. తరగతి గదుల్లో విద్యుత్, బెంచీలు, గ్రీన్ చాక్ బోర్డు, ఫ్యాన్లతో పాటు తదితర పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. మేజర్, మైనర్ మరమ్మతు పనులతో పాటు పాఠశాలల్లో నీటి సంపులు, మరుగుదొడ్లు అందుబాటులోకి తీసుకురావాలని పేర్కొన్నారు. నాణ్యతలో రాజీ పడొద్దని తెలిపారు. కార్యక్రమంలో బాసపల్లి మాజీ సర్పంచ్ అనంతయ్య, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

బొంరాస్‌పేట: దివంగత పాత్రికేయుడు ఉప్పరి వెంకటయ్య కుటుంబాన్ని గురువారం తెలంగాణ విద్యావంతుల వేదిక (టీవీవీ) రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్, నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా పత్రికా రంగంలో వెంకటయ్య చేసిన సేవలను కొనియాడారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేశారు. ఇందులో టీవీవీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మి, నాయకులు చంద్రశేఖర్, గోపాల్, అనిల్‌కుమార్, రవీందర్, గౌసుద్దీన్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు రాంచంద్రారెడ్డి, టీయూడబ్ల్యూజే ఐజేయూ మండల నాయకులు ఉన్నారు.

నియామకం

కొడంగల్: లయన్స్ క్లబ్ పట్టణ నూతన అధ్యక్షుడిగా సామాజిక కార్యకర్త మురహరి వశిష్టను ఎంపిక చేశారు. 2024–25 ఏడాదికి గాను నూతన కార్యవర్గాన్ని మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి సమక్షంలో గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మురహరి, కార్యదర్శిగా శివకుమార్ గుప్తా, కోశాధికారిగా వెంకట్‌రెడ్డి, మెంబర్ షిప్ కమిటీ చైర్మన్‌గా ముద్దప్ప దేశ్‌ముఖ్, ఉపాధ్యక్షుడిగా ఏన్గుల భాస్కర్, జాయింట్ సెక్రటరీగా శ్రీనివాస్ గౌడ్‌లను నియమించారు.

19న కమలనాథుల సమావేశం

తాండూరు రూరల్: కోత్లాపూర్ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఆదివారం బీజేపీ కార్యకర్తల ముఖ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నాయకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే సమీక్షకు బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు తరలి రావాలని పిలుపునిచ్చారు.

బీఆర్ఎస్ పాలనలో రైతులకు అన్యాయం

కందుకూరు: రైతాంగ వ్యతిరేక చర్యలు అంటూ బీఆర్ఎస్ నాయకులు గగ్గోలు పెట్టడం విడ్డూరంగా ఉందని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పాండురంగారెడ్డి విమర్శించారు. గురువారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కేసీఆర్ పదేళ్ల పాలనలో నాడు ధాన్యం తడిస్తే కొనే దిక్కేలేదన్నారు. అకాల వర్షాలతో పంట నష్టం జరిగితే పైసా సహాయం చేయలేదు, అలాగే పంటల బీమా పథకం నిర్వీర్యం చేశారన్నారు. 2018 ఎన్నికల మేనిఫెస్టోలో రూ.లక్ష రుణమాఫీ చేస్తామని మాట ఇచ్చి 2023 ఆగస్టు వరకు దాని ఊసే ఎత్తలేదన్నారు. వంద రోజుల కాంగ్రెస్ పాలనలో రైతు భరోసా కింద రూ.7500 కోట్లు వేశామని తెలిపారు. ఆగస్టు 15 లోపు రైతులకు రూ.2 లక్షల రుణమాఫీకి కార్యాచరణ ప్రకటించి, వచ్చే పంట నుంచి క్వింటాళ్‌కు రూ.500 బోనస్ ఇవ్వడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. అన్ని చేస్తున్నా ప్రభుత్వాన్ని ప్రతిపక్షాలు విమర్శించడం, నిరసనలకు దిగడం సిగ్గుచేటన్నారు.

వాన వదలదు.. చింత తీరదు

- తడిసి ముద్దయిన వరిధాన్యం
- అకాల వర్షంతో అన్నదాతలు విలవిల
- ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి



నాగారం కొనుగోలు కేంద్రంలో వరి కుప్పలు తడవకుండా కప్పిన కవర్లు



తడిసిన ధాన్యాన్ని వేరుచేస్తున్న జీడిగడ్డతండా రైతు రాజునాయక్

ధారూరు: అకాల వర్షం అన్నదాతలను అతలాకుతలం చేసింది. గురువారం సాయంత్రం గంటకు పైగా దంచికొట్టిన వాన.. కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం గింజలతో పాటు, కొనుగోలు కేంద్రాల్లోని వరి కుప్పలను సైతం ముంచెత్తింది. మండల పరిధి నాగారం, గురుదోట్లలో ఇదే ఆవిష్కృతమయింది. దీంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. 'కొనుగోలు ప్రక్రియ ఊపందుకోదు. వాన వదలదు, తమ చింత తీరదు. ఎండలో ఆరబెడుతున్నా తేమ శాతం తగ్గడం లేదని' వాపోతున్నారు. తేమ శాతం తగ్గడానికి వడ్లను ఎండకు ఆరబోయడం, అడపాదడపా వానలు రావడం.. పరుగున కవర్లు కప్పడంతోనే రోజులు గడుస్తున్నాయని, ఇలా అయితే తేమ శాతం తగ్గేదెప్పుడు? ప్రభుత్వం కొనుగోలు చేసేదెప్పుడు అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తడిసిన ధాన్యాన్ని కొంటామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా ప్రకటించినా.. తేమ శాతం 17 కన్నా తక్కువగా ఉండాలని, కాస్త ఎక్కువ ఉన్నా.. ధాన్యం తూకం వేయకుండా తిరస్కరిస్తున్నారని పేర్కొంటున్నారు. ఎటువంటి నిబంధనలు విధించకుండా తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేసి, తమను ఆదుకోవాలని జీడిగడ్డతండా, పీసీఎంతండా, నాగారం, అంపల్లి, కుమ్మర్‌పల్లి, మైలారం తదితర గ్రామాల రైతులు కోరుతున్నారు.

న్యాయస్థానం వినూత్న శిక్ష

మందుబాబులకు జరిమానాతో పాటు రోగులకు పండ్లు పంపిణీ చేయాలని ఆదేశం



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న మందుబాబులు

తాండూరు రూరల్: మద్యం తాగి పట్టుబడిన వాహన దారులకు న్యాయస్థానం స్పెషల్ జ్యూడీషియల్ న్యాయమూర్తి నామాల అశోక్ వినూత్న శిక్ష వేశారు. రూ.1,000 జరిమానాతో పాటు, రోగులకు పండ్లు పంపిణీ చేయాలని ఆదేశించారు. పట్టణ సీఐ సంతోష్‌కుమార్ వివరాల ప్రకారం.. తాండూరు పట్టణం సాయిపూర్‌కు చెందిన ఉదయ్, అభిజీత్, పరిగి మండలం గోవిదాపూర్‌కు చెందిన నగేష్, బషీరాబాద్ మండలం బహదూర్‌పూర్‌కు చెందిన రాజులు డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డారు. వీరిని గురువారం తాండూరు న్యాయస్థానంలో హాజరు పరచగా.. జరిమానాతో పాటు, జిల్లా ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేయాలని ఆదేశించారు. దీంతో 30 మందికి మందుబాబులు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మద్యం తాగి వాహనాలు నడపొద్దని సీఐ హెచ్చరించారు.

ఆర్థిక సహాయం

దోమ: మండల పరిధి మోత్కూర్ గ్రామానికి చెందిన పెంటయ్య అనే వ్యక్తి అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న కేఎస్ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు రాజేశ్వరమ్మ మృతదేహానికి నివాళులర్పించి, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం అంత్యక్రియల నిమిత్తం ఆర్థిక సహాయం అందజేశారు. ఇందులో ట్రస్ట్ సభ్యులు సారంగి, వెంకటయ్య, విజయ్, రామయ్య, చిన్నయ్య, శ్రీనివాస్, సురేశ్, శివానందం ఉన్నారు.

సంగమేశ్వర్ మృతి బాధాకరం

తాండూరు రూరల్: తెలంగాణ ఉద్యమకారుడు సంగమేశ్వర్ మృతి బాధాకరమని బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్ అన్నారు. తాండూరు పట్టణంలో గురువారం సంగమేశ్వర్ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పటేల్.. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఉద్యమ సమయంలో ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేశారు. అనంతరం కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేశారు. శుభప్రద్ వెంట ఉద్యమకారులు నరేష్, భాను, విజయ్, వీరమణి ఉన్నారు.

సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి



సమ్మర్ క్యాంప్‌లో పాల్గొన్న రాజ్‌కుమార్, క్రీడాకారులు

మంచాల: గ్రామీణ ప్రాంతాల్లోని యువతీయువకులు ఉచిత సమ్మర్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని మంచాల పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్ అన్నారు. గురువారం మంచాల ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంప్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు వేసవి సెలవుల్లో క్రీడల్లో చురుగ్గా పాల్గొనాలని సూచించారు. 14 సంవత్సరాలలోపు బాలబాలికలకు సమ్మర్ క్యాంప్‌లో కబడ్డీ, వాలీబాల్ క్రీడలు నేర్పిస్తారన్నారు. క్యాంప్ నిర్వహణకు ముందుకు వచ్చిన పీఈటీలు వెంకటేశ్, గిరి ప్రసాద్‌లను ఆయన అభినందించారు. కార్యక్రమంలో స్థానిక యువజన సంఘాల నాయకులు, గ్రామస్తులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

దేవాలయ భూమి అక్రమ రిజిస్ట్రేషన్



అదనపు కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

అధికారులకు ఫిర్యాదు చేసిన గ్రామస్తులు

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట గ్రామ శివారులో ఉన్న అంబా భవానీ మాత దేవాలయానికి సంబంధించిన భూమిని కొందరు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని పలువురు గ్రామస్తులు గురువారం దేవాదాయ శాఖ అదనపు కమిషనర్ కృష్ణవేణిని కలిసి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. అనంతరం ప్రతులను స్థానిక విలేకరులకు అందజేశారు. ఎలికట్ట గ్రామ శివారులోని భవానీ మాత దేవాలయానికి సంబంధించిన భూమి సర్వే నంబర్ 441లో 3 ఎకరాల 28 గుంటలు ఉందని పేర్కొన్నారు. అయితే ఈ భూమి దేవాదాయ శాఖకు సంబంధించి 43 రిజిస్టర్‌లో నమోదు చేయబడి ఉందని వెల్లడించారు. ఈ భూమిని 2015లో తుమ్మలపల్లి గుల్లె కృష్ణయ్య తన పేరున అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకొని, ప్రస్తుతం తిరిగి విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఆరోపించారు. ప్రస్తుత మార్కెట్‌లో ఈ భూమి విలువ రూ.15కోట్ల వరకు ఉందని, దేవాలయానికి సంబంధించిన భూములను నిబంధనలకు విరుద్ధంగా అమ్మినవారు, కొన్న వారిపై చర్యలు తీసుకొని.. భూములను కాపాడాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో ఎంపీటీసీ కావలి శ్రీశైలం, సంజీవయాదవ్, ఆర్ల యాదయ్య, రాజు, నారం రాంరెడ్డి, కృష్ణయ్య యాదవ్, శివ, శర్వలింగం, లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

పచ్చళ్లకు ధరల పోటు!

ఒక్కో మామిడి కాయకు రూ.15-20

- అదే బాటలో వంటనూనె, అల్లంవెల్లుల్లి
- విలవిల్లాడుతున్న సామాన్యులు



పచ్చడి కాయలు కట్ చేస్తున్న వ్యాపారి

హుడాకాంప్లెక్స్: పచ్చడికి ఉపయోగించే మామిడి కాయల ధరలు వంటింట్లో సెగలు పుట్టిస్తున్నాయి. ప్రస్తుతం మామిడి సీజన్ కావడం, ప్రతి ఇంట్లోనూ ఆవకాయ పచ్చడి పెట్టడం సర్వసాధారణం. ఏడాదంతా నిల్వ ఉండేలా ఏర్పాటు చేసుకునే ఈ పచ్చళ్లు.. పేద, మధ్య తరగతి ప్రజలకు పెరిగిన ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. అంతేకాదు ఇంట్లో పచ్చళ్లు పెట్టి దేశ, విదేశాల్లో స్థిరపడిన తమ పిల్లలకు పార్శిళ్లు పంపేవారు సైతం ఈ సారి వెనుకాడుతుండటం గమనార్హం.

దెబ్బతిన్న పంట

గత ఏడాదితో పోలిస్తే మామిడి దిగుబడి భారీగా తగ్గింది. దీనికి తోడు ఇటీవల కురిసిన ఈదురు గాలితో కూడిన వర్షాలు పంటను దెబ్బతీశాయి. డిమాండ్ మేరకు ఉత్పత్తి లేకపోవడంతో మార్కెట్లో మామిడి ధరలు భగ్గుమంటున్నాయి. పావు కేజీ కాయకు రూ.15 నుంచి 20 వరకు పలుకుతోంది. అంతేకాదు ఎండు మిర్చి కేజీ ధర రూ.200, అల్లం కేజీ రూ.160, వెల్లుల్లి కేజీ ధర రూ.270 వరకు పెరిగాయి. ఇక ఆయిల్ ధరలు పెరిగాయి. పల్లి నూనె కేజీ రూ.180 పలుకుతుండగా, పొద్దుతిరుగుడు రూ.140–160 వరకు పలుకుతోంది.

పోపు గింజలు ప్రియం

అంతేకాదు మార్కెట్లో కొనుగోలు చేసిన కాయలను కట్ చేసే ప్రక్రియ కూడా ఖరీదుగా మారింది. ఒక్కో కాయకు రూ.5 చొప్పున తీసుకుంటున్నారు. ప్రస్తుతం పెరిగిన ఈ ధరల ఘాటుకి పోపు గింజలు కూడా మాడిపోతున్నాయి. పెరిగిన ఈ ధరలతో మెజార్టీ వినియోగదారులు పచ్చళ్లు పెట్టడం కంటే మానుకోవడమే ఉత్తమమని భావిస్తున్నారు. గతంలో వంద కాయలు పచ్చడి పెట్టిన వారు.. ప్రస్తుతం 50 కాయలతోనే సరిపెట్టుకోవాల్సి వస్తుంది.

ఆత్మస్థైర్యం.. రక్షణకు దోహదం

ఈ నెల 25వరకు కరాటేలో ఉచిత శిక్షణ

అనంతగిరి: కరాటేతో ఆత్మస్థైర్యం పెరగడంతో పాటు.. రక్షణకు దోహదపడుతుందని, మానసిక ప్రశాంతత లభిస్తుందని కోచ్ ఎండీ ఖాజాపాష తెలిపారు. వేసవి సెలవుల్లో భాగంగా వికారాబాద్ పట్టణం మేరినాట్స్ మైదానంలో మాస్టర్ జపాన్ షోటోకాన్ కరాటే డు అసోసియేషన్ ఇండియా వికారాబాద్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 26 నుంచి ఉచిత కరాటే శిక్షణా తరగతులు కొనసాగుతున్నాయి. ఇందులో సుమారు 60మంది విద్యార్థులు ఉదయం 6 గంటల నుంచి 7.30 వరకు శిక్షణ పొందుతున్నారు. ఫౌండర్ అండ్ చీఫ్ డైరెక్టర్ ఎండీ ఖాజాపాష, సీనియర్ శిక్షకుడు డి.విజయ్ ఆధ్వర్యంలో చిన్నారులకు శిక్షణ ఇస్తున్నారు. కోచ్ మాట్లాడుతూ ఏటా ఇలాంటి ఉచిత శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ నెల 26 వరకు అన్ని విధాలా చిన్నారులకు తర్ఫీదు ఇస్తామని వెల్లడించారు.



కరాటేలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు



దోమ: ర్యాలీ తీస్తున్న వైద్య సిబ్బంది

పగటి దోమలతో జాగ్రత్త

- డెంగీ నివారణకు కృషి చేయాలి
- ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి
- డెంగీ నివారణ దినోత్సవంలో వైద్య సిబ్బంది

దోమ: పగటి పూట కుట్టే లార్వా దోమల వలన డెంగీ వ్యాపిస్తుందని, తగిన జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధితో ప్రమాదం ఉండదని మండల వైద్యాధికారి రజిత తెలిపారు. డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో గురువారం వైద్య సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. డెంగీ నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. డెంగీ జ్వరం రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు ఇంటి పరిసరాల్లో పరిశుభ్రతను పాటించి, మురుగు నీరు లేకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఎచ్‌ఓ విజయలక్ష్మి, ల్యాబ్ టెక్నీషియన్ ప్రసాద్, స్టాఫ్‌నర్స్ పద్మ, హెల్త్ అసిస్టెంట్ స్రవంతి, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

బంట్వారంలో..

బంట్వారం: డెంగీ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైద్య సిబ్బంది సూచించారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం బంట్వారం, కోట్‌పల్లి మండలాల్లో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది మాట్లాడారు. దోమలు వ్యాప్తి చెందకుండా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నీటి కులాయిలను, డ్రమ్ములను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, నిలువ ఉంచిన నీటిని పారబోయాలని చెప్పారు. ఖాళీ డబ్బాలు, పాత టైర్లు, ప్లాస్టిక్ వస్తువులను పరిసరాల్లో ఉండకుండా జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ విజయ్‌కుమార్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చినుకు పడితే చిత్తడే

- బురదలో ప్రయాణ ప్రాంగణం
- బస్టాండును పట్టించుకోని అధికారులు



కొడంగల్ బస్టాండ్ ముందు భాగం పరిస్థితి

కొడంగల్: నియోజకవర్గ కేంద్రమైన కొడంగల్ బస్టాండ్‌పై ఆర్టీసీ అధికారులు చిన్న చూపు చూస్తున్నారు. ముఖ్యమంత్రి ఇలాకా అయినప్పటికీ వసతులు కల్పించి, అభివృద్ధి చేయడంలో విఫలమవుతున్నారు. దీంతో చినుకు పడితే బస్టాండు, ఆవరణ మొత్తం చిత్తడిగా మారి, ప్రయాణికులకు అసౌకర్యాన్ని కలగజేస్తోంది. ప్రాంగణంలోకి వెళ్లాలన్నా, వెలుపలికి రావాలన్నా కష్టమేనని ప్యాసింజర్లు పేర్కొంటున్నారు. రెండు జాతీయ రహదారులకు కేంద్ర బిందువుగా, సరిహద్దు ప్రయాణ ప్రాంగణంగా పేరుగాంచిన కొడంగల్ నుంచి నిత్యం వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. కర్నాటక, మహారాష్ట్ర ప్రాంతాలకు చెందిన వారు కొడంగల్ మీదుగా పయనిస్తుంటారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా..

జిల్లాల విభజనకు ముందు కొడంగల్ నియోజకవర్గం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఉండేది. అయితే కొడంగల్ బస్టాండ్ మాత్రం తాండూరు డిపో పరిధిలో ఉండేది. జిల్లాలను వేరు చేసిన తర్వాత కొడంగల్‌తో పాటు బస్టాండు కూడా వికారాబాద్ జిల్లా పరిధిలోకి వచ్చింది. విలీనం అనంతరం ప్రయాణ ప్రాంగణాన్ని ఎవరూ పట్టించుకోవడం కొడంగల్ ప్రజలు ఆరోపిస్తున్నారు. బస్టాండ్‌లో నాలుగైదు బెంచీలు మాత్రమే ఉన్నాయని, తాగునీటి వసతి లేదని పేర్కొంటున్నారు. రాత్రి వేళల్లో రక్షణ లేదని, ప్రాంగణం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని వాపోతున్నారు. సుమారు నాలుగు దశాబ్దాల క్రితం బస్టాండు నిర్మించినప్పుడు ఎలా ఉందో.. ఇప్పుడు అలాగే ఉందని, బస్సులు నిలిపే ప్లాట్ ఫారాల పెంపుతో పాటు బస్టాండ్ స్థాయిని పెంచాల్సిన అవసరం ఉందని ప్రయాణికులు కోరుతున్నారు.

కేటీఆర్‌ను కలిసిన నాయకులు



కేటీఆర్‌తో మాజీ సర్పంచ్ సత్యనారాయణ, గ్రామ నాయకులు

చేవెళ్ల: 'మండలంలో బీఆర్ఎస్ పార్టీని నడిపించే నాయకులు కరువయ్యారు. మా పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. మీరే మాకు మార్గనిర్దేశం చేయాలి' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను శంకర్‌పల్లి మండలం శేరిగూడ మాజీ సర్పంచ్ సత్యనారాయణ, గ్రామ నాయకులు కోరారు. గురువారం నగరంలో కేటీఆర్‌ను శేరిగూడం మాజీసర్పంచ్ సత్యనారాయణ, మాజీ ఉపసర్పంచ్ ఇంద్రాసేనారెడ్డి, వార్డు మాజీ సభ్యులు వెంకటేశ్, రాజేందర్, ప్రసాద్, యాదగిరి, గ్రామ యువకులు కలిశారు. ఈ సందర్భంగా వారు కేటీఆర్‌తో పార్టీ పరిస్థితిని వివరించారు. మండలంలో ఒకప్పుడు ఒక వెలుగు వెలిగిన పార్టీ పరిస్థితి ఇప్పుడు తారుమారైందని తెలిపారు. ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, వైస్ ఎంపీపీ, మున్సిపల్ చైర్‌పర్సన్‌లు అంతా పార్టీ మారారని పేర్కొన్నారు. మా గోడు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావటం లేదని కేటీఆర్ ఎదుట వాపోయారు. మండలంలో మాకు నాయకుడు ఎవరు అనేది తెలియకుండా పోయిందన్నారు. మా ఎమ్మెల్యే కాలె యాదయ్య ఉన్నా.. ఆయనకు ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించడం లేదని చెప్పారు. మండలంలో పార్టీ పరిస్థితిని పట్టించుకునే నాయకుడు కావాలని కోరారు. దీనిపై కేటీఆర్ స్పందించి తప్పకుండా వారం పదిరోజుల్లో మండల పరిస్థితిని స్వయంగా పరిశీలిస్తానని హామీనిచ్చారు. మండలంలో పార్టీ కార్యక్రమాలను కొనసాగించాలని సూచించినట్లు తెలిపారు.

ఉపాధి కూలీకి చేయూత

యాచారం: మండల పరిధిలోని మంతన్‌గౌరెల్లి గ్రామానికి చెందిన మూడవత్ కోటకు కొద్ది రోజుల కింద ఉపాధి పనులు చేస్తుండగా కాలికి తీవ్ర గాయమైంది. దీంతో అతను కొద్దిరోజులుగా ఇంటి వద్దే ఉంటున్నాడు. విషయం తెలుసుకున్న అదే గ్రామానికి చెందిన బీజేపీ గిరిజన మోర్చా యాచారం మండల అధ్యక్షుడు గణేశ్‌నాయక్ గురువారం రూ.5వేల నగదుతో పాటు 50 కిలోల బియ్యం అందజేశాడు. ఆరోగ్య సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

కర్షకులను మోసం చేసిన కాంగ్రెస్

- హామీ మేరకు వరిధాన్యం బోనస్ ఇవ్వాలి
- లేని పక్షంలో పోరాటం తప్పదు
- మాజీ ఎమ్మెల్యేలు మహేశ్‌రెడ్డి, ఆనంద్



పరిగి: నిరసనలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి తదితరులు

పరిగి: ఎన్నికల సమయంలో వరి ధాన్యానికి క్వింటాలుకు అదనంగా రూ.500 బోనస్ ఇస్తామని రైతులకు హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇప్పుడు మోసం చేస్తుందని మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పిలుపు మేరకు గురువారం పట్టణ కేంద్రంలో బస్టాండ్ ఎదురుగా గులాబీ శ్రేణులు నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా కొప్పుల మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో వరి పండించిన ప్రతి రైతుకు బోనస్ ఇస్తామని చెప్పిన కాంగ్రెస్.. తీరా ఇప్పుడు సన్న వడ్లకే ఇస్తామనడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. తెలంగాణలో దాదాపుగా 90శాతానికి పైగా రైతులు దొడ్డు రకం వడ్లనే పండిస్తారని, ఇది తెలిసి కూడా ప్రభుత్వం అన్నదాతలకు మోసం చేస్తుందని విమర్శించారు. హామీ మేరకు వరి పండించిన రైతులందరికీ బోనస్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలోనే రైతులకు న్యాయం జరిగిందని, అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ మాటమార్చిందన్నారు. రైతుల పక్షాన నిలబడి, వారికి ఇచ్చిన హామీలను నెరవేర్చేంత వరకు పోరాటం చేస్తామని పేర్కొన్నారు. ఇందులో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్, ఎంపీపీ అరవింద్‌రావు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ భాస్కర్, నాయకులు ప్రవీణ్‌రెడ్డి, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

బోనస్‌తో ధాన్యం కొనుగోలు చేయండి

ధారూరు: కొనుగోలు చేసిన ధాన్యానికి బోనస్ డబ్బులు కలిపి రైతుల ఖాతాల్లో జమ చేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ డిమాండ్ చేశారు. పార్టీ పిలుపు మేరకు రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా.. మండల పరిధి గట్టెపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడారు. ధాన్యానికి గిట్టుబాటు ధరతో పాటు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం.. ఎన్నికల అయ్యాక మాట మార్చిందని ఆరోపించారు. ఇప్పుడు సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామని చెప్పడం రైతులను మోసం చేయడమే అవుతుందని మండిపడ్డారు. దొడ్డు రకం వడ్లకు బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇందులో పార్టీ మండల శ్రీకాంత్‌రెడ్డి, ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



ధారూరు: సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న గులాబీ శ్రేణులు, రైతులు